# మధ్యమెట్టు



ఇచ్ఛాపురపు రామచంద్రం

పుస్తకం ముందు వేసుకుని కూర్చుందన్న మాటేకాని వాసవి దృష్టి ఎంతమాత్రమూ ఆ పుస్తకం మీద లేనే లేదు. ఆమె ఏదో ఆలోచనలో ములిగి ఉంది.

అప్పుడే వీధిలోంచి వచ్చిన వెంకట్రావు - ముక్కాలిపీట వేసుకొని ఆమెకెదురుగా కూర్చుంటూ - అరువు తెచ్చుకున్న నిన్నటి పేపరు తెరవబోతూ- "కొంచం టీ నీళ్లు యివ్వగలవా వసూ?" అన్నాడు మెల్లగా.

అతనివంక ఒక్కసారి బాధగా

చూసి - తలవంచుకుని - తప్పు చేసిన దానిలా— "టీ పొడి కొంచమే ఉంది, అరకప్పు కూడా ఔతుందనుకోను" అందామె. "టీ పొడి లేదూ? పోసీ... కాఫీయే యివ్వు, ఏం చేస్తాం, సరిపెట్టుకుందాం." నవ్వాడు వెంకట్రావ్. ఆమె కూడా నవ్వకుండా ఉండలేకపోయింది. కాని - ఆమె నవ్వుకి కన్నీళ్లు తోడు వచ్చాయి. "కాఫీపొడి నిన్ననే అయిపోయింది కదా?" భారంగా అంది వాసవి.

"అదే వద్దన్నాను! వసూ! కన్నీటి విలువ అనంతం. అమూల్యమయిన అశ్రువుల నతిపదిలంగా దాచుకోవాలి తప్ప చిన్న చిన్న యిబ్బందులకి ఖర్చు పెట్టెయ్యకూడదు. దీన్నే దుబారా అంటారు. మనం బ్రతుకుతున్నది పొదుపు రోజులలో. ఇంతకీ - నేనడిగింది టీ నీళ్లు. మరిగేనీళ్లలో మచ్చుకి కొంచం టీ పొడి వెయ్యి. ఉంటే పాలూ పంచదారా చేర్చు, లేకపోయినా కొంపమునగదు. నీకు తెలియదుకానీ- నీ హస్తం అమృత హస్తం. నీ చేత్తో ఎలా కాచినా అద్భుతంగా తప్ప మరొకలా రాదు."

కళ్లు తుడుచుకుని లోపలకి నడిచింది వాసవి.

వెంకట్రావ్ పేపరు తిరగేస్తూ కూర్చున్నాడు.

ఐదునిముషాలలో - కప్పుతో టీ, సాసరూ పట్టుకుని వచ్చింది వాసవి. "నువ్వూ తీసుకో. ఊహుఁ... వద్దనకు ఇద్దరమూ సగం సగం.." సాసరులో సగం టీ పోసి యిచ్చాడు వెంకట్రావ్. ఇద్దరూ టీ పూర్తిచేశారు.

"నేను వచ్చేటప్పకి దేనిగురించో చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్, ఏమిటది?" వాసవి మౌనందాల్చింది.

"నా దగ్గర దాచుకోవలసిన రహస్యాలుంటాయనుకోను."


"రహస్యమేమీ కాదు. ఉద్యోగం గురించి ఆలోచిస్తున్నానంతే."

కొంచం ఆగి మెల్లగా అంది-"ఇవాళ కూడా ఏమీరాలేదు. కనీసం రిగ్రెట్స్ తెలిపినా బాగుండేది. మరొక ప్రయత్నం చేసుకుందుము ఇంక ఆశలేనట్లే అనుకుంటాను-"

"రోజులలాగమండిపోతున్నయ్‌వసూ!మా రోజులలో మాథమటిక్స్ గ్రాడ్యువేటంటే కళ్లకద్దుకుని ఉద్యోగాలిచ్చేవారు. అందులోనూబి.యిడి.కూడా అయితే చెప్పాలా? అయినా ఎన్నాళ్లకిందట ముచ్చట అని? మహా అయితే ఏడెనిమిదేళ్లు! అంతే."

"ఏడెనిమిదేళ్లలో ఎంతమారిపోయాయి పరిస్థితులు! కళ్ల కద్దుకోనవసరం లేదు. కాళ్లు పట్టుకుని కనికరించమని వేడినా ఉద్యోగాలకు కనికరం లేకుండా పోతూంది!" విరక్తిగా అంది వాసవి.

"గుడ్డిలోకం! మెరిట్‌ని చూడలేకపోతోంది. విద్యార్హతలని అవతలికి




తోసి - రికమెండేషన్లనీ లంచాలనీ తుల తూచి ఉద్యోగాలనుగ్రహిస్తున్నారు! చదువు విలువ పడిపోతోంది. ఈ విష వలయానికి అంతం ఎక్కడో ఎంత ఆలోచించినా అర్థంకావడంలేదు-"

"అందుకే అంటారు - మప్పడం తేలికేకాని తిప్పడం కష్టం అని. రికమెండేషన్లూ, లంచాలూ మనం అలవాటు చేసినవే. ఎవరి స్వార్థం వారిది మరి. దీనికెవర్ని తప్పుపట్టి ఏంలాభం?

అన్నట్లు... మొన్న పేపరు చూశావా? కుటుంబాని కొక ఉద్యోగి..."

"ఆ... చూశాను. నవ్వుకున్నాను. నువ్వుకాని నమ్ముతున్నా వేమిటా రాతలన్నీ? అంటువంటి పొరపాటు చెయ్యకు. అవన్నీ మాటల వరకే. చేతలు శూన్యం. ఎన్నిసార్లు అనుభవం కాలేదు?"

నీరసంగా నిట్టూర్చింది వాసవి. "పోనీలే మన గీత యిలా ఉంటే ఒకరి ననుకుని ఏంలాభం?"

"ఆ నిరాశే వద్దన్నాను. నీకు తెలియదు వాసవీ, జీవితం చిత్రమైంది ఎప్పుడెలా మలుపుతిరుగుతుందో ఎవరికీ తెలియదు. అదృష్టం తలుచుకుంటే అందల మెక్కించనూ గలదు - అధఃపాతాళాని కణగద్రొక్కనూ గలదు- విధి ఆడే ఆటలు చాలా తమాషాగా ఉంటాయి. జీవితాన్ని చూసి నవ్వడం కూడా నేర్చుకోవాలి వాసవీ! లేకపోతే అది బహుదుర్భరంగా తయారౌతుంది."

"ఆశలన్నీ ఆకాశ కుసుమాలే ఔతూంటే నిరాశకాక ఏముంటుంది? బి.ఏ. మాథ్స్ ఫస్ట్‌క్లాసు. బి.యిడి.లో ఫస్ట్ రాంక్. ఈ అర్హతలన్నీ కలసి-ఒక

ఎలిమెంటరీ స్కూలు మిస్ట్రెస్ ఉద్యోగాన్ని సాధించలేకపోయాయంటే..."

లోపం నీ అర్హతలది కాదు. పెద్ద వాళ్ల రికమెండేషనో, మస్తుగా లంచమో చూపగలిగితే - ఎలిమెంటరీ స్కూలు టీచరు గిరీ యేంఖర్మ, కాలేజిలో ట్యూటర్ పోస్టే వచ్చేది!

వర్గపోరాటం వసూ! వర్గపోరాటం. మనది కపట ప్రజాస్వామ్యం. దీనిలో సామాన్య మానవుడికి స్థానంలేదు. పేదలని ప్రభుత్వ విధానాలే అణగద్రొక్కేస్తున్నాయ్. గొప్పవాళ్లింకా గొప్పవాళ్లయిపోతారు తప్ప సామాన్యులు ఉద్ధరించబడరు."

"ఈ మధ్య తరగతి అనేది పెద్ద శాపం. ఇదొక త్రిశంకుస్వర్గం. మధ్య తరగతి మనిషికి-పైకిపోయే ఆస్కారం దొరకదు. క్రిందకి జారి మామూలు మనుషులతో కలవలేడు! పరువు... ప్రతిష్ఠ అంటూ శుష్కపదాలను పట్టుకుని పాకులాడుతూ జీవితాన్ని నరకం చేసుకోడమే మిగులుతుంది. ఊపిరాడనీయని త్రిశంకు స్వర్గంమిది!

ఈ డిగ్రీలను నమ్ముకుని నేను పెద్ద పొరపాటే చేశాననిపిస్తోంది. హాయిగా ఏ కుక్‌గానో చేరితే..."

"వసూ! నేనింకా బతికే ఉన్నానని మరచిపోకు."

"ఎందుకంత ఆవేశం? నేనన్న దానిలో తప్పేముంది? జీవితం గడవడానికొక ఉపాధి. వైట్ కాలర్డ్ జాబ్ మీద వ్యామోహం - యిది కూడా మధ్య తరగతి మనస్తత్వమే. శారీరక కష్టం మనకి చిన్నతనం! అందుకే జీవితం సమస్య ఐపోతోంది. సరేలే... మాటలు తప్ప క్రియలో ఎలాగా చూపలేం..."

"ఒక్కసారి వీధిలోనికి వెళ్లిరావాలి వసూ! రేడియో వినాలి."

"వీలయితే - కాఫీపొడి-"

"ఎందుకా మొహమాటం? అప్పు దొరికితే అంతే సమంజసంగా ఉంటుంది-"


నవ్వుతూ నిష్క్రమించాడు వెంకట్రావు.

*　　*　　*

సాయంత్రం ఐదుగంటలు.

సిటీ సింగారించుకుంటూంది. చీకటి పడకపోయినా ట్యూబ్‌లైట్లు వెలుగుతున్నాయి రోడ్లపక్క షాపులలో. జులపాల జుత్తులతోటీ-పెద్ద పెద్ద చెంపలతోటి - లుంగీలలోనూ సివిలిజేషన్ రోడ్లమీద వీరవిహారం చేస్తూంది. శ్రీమంతుల షికారు కార్లు సిటీరోడ్లకి స్టేటస్ పెంచుతున్నాయి. హొటళ్లు రష్‌గా ఉన్నాయి. నాగరికత ఆకలి తీర్చుకుంటూంది.

న్యూస్ పేపరు బడ్డీ కిటకిటలాడుతోంది. న్యూస్‌పేపరు కూడా నాగరికతలో ఒక భాగమే. నవీన నాగరికులు భుజాలకు ట్రాన్సిస్టర్లు వేలాడేసుకుని




మరీ తిరుగుతున్నారు. నిజంగా వాళ్లు గానరసాస్వాదకులే అయితే - కారు హారన్లూ, రోడ్లు రొదా-వీటి మధ్య సంగీతాన్ని వినగలరా ? ఆస్త్రోప్ సంగీతం.

'రేపటికీ పేపరు పొట్లాలు కట్టుకందుకు తప్ప పనికిరాదు. ఏక్ దిన్ కా సుల్తానయిన పేపరు కెంత మిడిసిపాటు ? కొనకుండా పేపరు చదివే వెంకట్రావు వేలాడుతున్న పేపర్లని చూస్తూ కసిగా అనుకున్నాడు-ద్రాక్షపళ్లు అందని నక్కలా. రోడ్డుమీద నిలబడి హెడ్‌లైన్స్ చదవాలని తాపత్రయపడుతున్నాడు.

కారుహారన్ కర్కశంగా - మృత్యు గర్జనలా-మ్రోగింది.

త్రుళ్లిపడి - తప్పుకున్నాడు వెంకట్రావ్.

ఒక్కసారి - కారువంక చూశాడు. ఎవరో పెద్దవాడు...

ఇద్దరూ ఒక్క క్షణంసేపు ఒకరినొకరు చూసుకున్నారు. కదలబోయిన కారు-ఎందుచేతనో ఆగిపోయింది. అతను దిగి వచ్చి - వెంకట్రావు చెయ్యిపట్టుకుని సూటిగా కళ్లల్లోకి చూశాడు.

వెంకట్రావుకి భయంవేసింది.

పేవ్‌మెంటుదాటి - రోడ్డుమీద పరధ్యానంగా నిలబడటం నేరమే. ప్రమాదం తప్పిందిగా ? అతను తన మానాన తాను పోకుండా కారుదిగివచ్చి తనను పట్టుకుంటాడేం ? కొంపతీసి పోలీస్ స్టేషనికి నడవమనడుకద ?

"నడు-" చెయ్యిపట్టుకు, లాక్కెళ్తున్నాడు.

"ఎక్కడికి ?" భయంగా అడిగాడు వెంకట్రావ్.

ఆ ప్రశ్న వినిపించుకోనట్లే - "నీపే రేమిటి ?" అంటూ ప్రశ్నించాడతను.

"వెంకట్రావ్ ... పచ్చి గో ళ్ళ వెంకట్రావ్ ..."

"పచ్చిగోళ్ళేమిటి ? ఎండుగోళ్ళు కూడా ఉంటాయా ?" హుందాగా నవ్వాడతను వెంకట్రావ్‌ని బలవంతంగా కారులోకి తోస్తూ.

కారు కదిలింది—మెల్లగా, మెత్తగా.

వేగం పెంచుకుంది - త్వరగా ... సుఖంగా.

ఎంత హాయిగా ఉందనుకున్నాడు వెంకట్రావు కుషన్‌సీట్ల మెత్తదనం అనుభవిస్తూ.

వేగంలో ఆనందం అతనికి అనుభవానికి వస్తున్న క్షణంలో- పోలీస్‌స్టేషన్ కనిపించి అంత ఆనందమూ అంతరించి గుండెలు దడదడలాడాయి.

చివరిప్రయత్నం చెయ్యకుండా ఉండలేకపోయాడు. "చూడండి...రోడ్డుమీద పరధ్యానంగా నిలబడటం తప్పే. ఆ న్యూస్‌పేపరు బడ్డీ ఎంక్రోచ్ కాకపోతే తప్పకుండా పేవ్‌మెంట్‌మీదే నిలబడేవాడిని. మీ కారుకి అడ్డంవచ్చేవాణ్ని కాదు..."

"షటప్."

వెంకట్రావు అభిమానం .దెబ్బతింది. బోలెడంత కోపంవచ్చింది. అసహనంగా- "మీరు చాలా గొప్పవారే కాదురుగాక. నేనూ మనిషినని మరచిపోకండి. అసభ్యంగా మాట్లాడితే - అసలే నాకు ఆవేశమెక్కువ. ఫలితాలు బాగుండవు. నేరానికి క్షమాపణ అర్థించానుగా ? నన్ను వదిలెయ్యండి."

"వదలను -" మొండిగా అన్నాడతను. "నేను జాగ్రత్తగా చూడకపోతే- సమయానికి నా కారు బ్రేక్స్‌పడకపోతే- ఏమయ్యుండేది ? నాకు జీవితాంతం దుఃఖమూ, పశ్చాత్తాపమూ మిగిలి ఉండేవి."

"ఒక మనిషి ... మామూలు మనిషి ప్రాణంకోసం మీ గొప్పవాళ్ళు అంత విచారిస్తారంటే నేన్నమ్మను. మహా అయితే కోర్టుగొడవ తేదీవరకూ కొంచం చిరాకుపడి - తరువాత మరచిపోతారు మీరు మరీ గొప్పవాళ్ళలాగే ఉన్నారు. కేసులో కూడా యిరుక్కోరు. తెలివిగా ఎవరి మీదకో నెట్టేస్తారు. అధికారులూ, చట్టమూ గొప్పవాళ్ళ పక్షమేకదా !"

"నోరు ముయ్యరా ఫూల్..."

"ఎవడ్రా నువ్వు ?" చెయ్యెత్తాడు వెంకట్రావు.

"శేఖరాన్నిరా ! స్కూలుఫైనలు పరీక్షల్లో నువ్వు ఎవరికోసం పెద్ద సాహసం చేసి - స్లిప్పులిచ్చి శ్రమపడ్డావో ఆ శేఖరాన్ని. నీ బాల్యస్నేహితుణ్ని. అంత స్నేహం మరచిపోయావురా ఇడియట్ ? మనుషులని - మనసిచ్చిన స్నేహితులని

మరచిపోగల్గిన గొప్పవాళ్ళు ఎవరు? నువ్వా, నేనా?" మండిపడ్డట్లు నటించాడు శేఖరం.

"శేఖరం!" వెంకట్రావు కళ్ళు మెరిశాయి-ఆనందంతోనూ, ఆశ్చర్యంతోనూ.

"ఇప్పటికేనా మనిషివయ్యావ్, సంతోషం. నన్ను ఒరేయ్ అని పిలవరా బాబూ. నీకు పుణ్యముంటుంది. మొహమాటపడకు. నేను ఆనాటి శేఖరాన్నిరా బాబూ. కోమటి రంగయ్య కొట్లోకొన్న చేగోడీలు కాకెంగిలిచేసి నాకు పెట్టే వాడివే, ఆ శేఖరాన్ని. వెంకూ! నా బాధలు నీకు తెలియవురా. చెప్తాను. ఇన్నాళ్ళకి దేముడు కరుణించి పంపిన దూతలా కనిపించావు. నాకొట్టే టైము లేదు ఒక గంట ..అంతే. ఒక్కగంట సేపు ప్రపంచాన్ని మరచిపోదాంరా. ఈ బ్లడీహెల్ వదిలి-హాపీ హెవెన్‌లో ఉండి వద్దాం. నీ సహకారం సంపూర్ణంగా అవసరంరా వెంకూ. అలా డల్‌గా ఉండకు. ఉత్సాహం తెచ్చుకోరా. నా కోసం ... ఆ నాడు నీ భవిష్యత్తునే లెక్కచెయ్యకుండా దుస్సాహసంచేసి న్ను స్కూలు ఫైనలు గట్టెక్కించావే, అలాగే యీనాడు...నా కోసం ఓ గంట ఉత్సాహంపుంజుకోరా. నన్ను ఒరేయ్ అనరా. వెధవా అని తిట్టరా. నీకు మొక్కుతాను. బాబ్బాబు ... నీ గెడ్డం పట్టుకుంటాను. అప్పటి పెంకి వెంకువి అవరా.''

కారాగింది-ఐ బి. ముందు.

* * *

"నన్ను నీతో తాగమంటావుట్రా శేఖరం? అలాగేలే. ఇద్దరం ఎంజాయ్ చేద్దాంరా, శేకూ.''

హర్షోద్రేకంతో వెంకట్రావుని కౌగలించుకున్నాడు శేఖరం.

పెరిగిన గెడ్డాన్ని - గడ్డకట్టిన దరిద్రాన్ని – మాసిన బట్టల మధ్యతరగతి మనిషిని ఆప్యాయంగా, అభిమానంగా, అతిగాఢంగా కౌగలించుకున్నాడు శేఖరం.

ఐ. బి. రూము తలుపులు మూసుకున్నాయి.

అరగంటసేపు వాళ్ళిద్దరూ ఒరేయ్ ఒరేయిలైపోయారు. చిన్నతనాన్ని గుర్తు తెచ్చుకున్నారు. మాట్లాడుకున్నారు. ముచ్చట్లు చెప్పుకున్నారు. కొట్టుకోలేదు కానీ తిట్టుకున్నారు. చిన్నపిల్లల్లా సందడి చేశారు. చివరకి-స్నేహమయమైన చిన్ననాటి ప్రపంచంనుంచి అయిష్టంగా వర్తమానంలోకి రాక తప్పలేదు.

ఇద్దరూ పెద్దవాళ్ళయిపోయాక - బుద్ధిగా సోఫాలో కూర్చుని కాఫీ తాగసాగేరు. "అయితే నువ్వేం చేస్తున్నట్లు?" అడిగాడు శేఖరం.

"ప్రస్తుతం ... ఏమీలేనట్లే లెక్క. కొన్నేళ్ళ క్రిందటివరకూ అర్బన్ బ్యాంకులో గుమాస్తాగా పనిచేసేవాడిని. కాని ... నేను చెయ్యనినేరం ఒకటి నా నెత్తిమీదపడి బర్తరఫ్ అయ్యాను. కొన్ని కష్టాల అనంతరం - ఓ బట్టలకొట్టులో

అకౌంట్సురాసే ఉద్యోగం అతికష్టంమీద దొరికింది. ప్రస్తుతం అదే వెలగబెడుతున్నాను. జీతం - నెలకి వందరూపాయలు."

"వాసవి, పెళ్ళయిందా ? అతనేం చేస్తున్నాడు ?"

''వాసవి పెళ్ళి కావాలంటే కనీసం పదివేలు పట్టుకోవాలి. అందుచేతకాలేదు. బి.ఏ.,బి.యిడి. అయి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూంది. ఈ రోజులెలా ఉన్నాయో నీకు తెలుసుగా ? లంచమో, రికమెండేషనో లేకపోతే ఉద్యోగం దొరకడం కల్ల.''

"బి.ఏ.,బి.యిడి. అయిందా వాసవి ! ఉండు ... జిల్లాపరిషత్ ఛైర్మన్ మనవాడేలే... "

"ఈ మధ్య జరిగిన ఇంటర్వ్యూకి వాసవి హాజరయింది. ఇంకా ఎవరినీ అపాయింట్ చేసినట్లు లేదు ''

"చెప్పవేం మరి ? ఉండు...'' త్వరత్వరగా ఫోను తీశాడు. ఒక నంబరు డయల్ చేశాడు.

''హలో...''

''యస్...''

''శేఖర్ స్పీకింగ్ ... రఘురామ్‌జీయేనా ?''

"ఊఁ. ఎప్పుడొచ్చారు ?"

''ఒక గంట ... మరో అరగంటలో అర్జంటుగా ఢిల్లీ పోవాలి. కులాసాయేనా ?"

"ఊఁ.''

"చాలాకోపం వచ్చింది కదూ ? సారీ రఘురామ్‌జీ. తీరికలేక రాలేకపోయాను. వెరీ వెరీ బిజీ. బిలీవ్ మి. శ్రీమతీజీకి నా అపాలజీస్ అందజెయ్యండి. మీ మినిస్టరు క్షేమయినా కబుర్లున్నాయా ? కన్వే చేస్తాను. అతనితో పనికూడా ఉంది.''

"క్షేమం అని చెప్పండి."

''అమ్మయ్య ! కోపంపోయింది మీకు. బై ది బై మీతో ముఖ్యమైన పనొకటి పడింది.''

''నాతోనా ? నేను బిజినెస్ మాన్‌ని కానుగా ? నాతో కూడా పనులుంటాయా మీకు ?"

"ఉంటాయి. ఉంది. రేపు మిమ్మల్ని నా ఫ్రెండ్ వెంకట్రావ్ కలుస్తాడు. అపాయింట్‌మెంట్ కావాలి."

"చంపారు. క్యాబినెట్ మినిస్టర్లదగ్గర నుంచి రికమెండేషన్లున్నాయి. ఉన్నదొక్క పోస్టు. ఎవరికిస్తే ఏం కొంపమునుగుతుందో అని అట్టేపెట్టేశాను "

"నోనో... అలా అంటే వీల్లేదు. వెంకట్రావు నాకు చాలా చాలా క్లోజ్ ఫ్రెండ్, రఘురామ్ ! రేపు వెంకట్రావు నా లెటర్ పట్టుకువస్తాడు. అపాయింట్‌మెంట్ ఆర్డరతనికివ్వవలసిందే. తప్పదు. నామాట కాదన్నారో మీరు యిక్కడ చాలా అల్లరి చేస్తున్నారని మీ మినిస్టర్‌కి చెప్పేస్తాను."

"రేపు మీ ఫ్రెండ్‌ని పంపండి."

"ఓ. కె. అలా ఉండాలి. సీ యూ సూన్." ఫోన్ క్రాడిల్‌లో పెట్టేసి వెంకట్రావు వంక తిరిగాడు శేఖరం. "పెద్దవాళ్ళ వ్యవహారాలిలాగే ఉంటాయిలే.

రఘురామూ, నేనూ స్నేహితులం అనుకోకు. ఈ హైక్లాస్ సొసైటీ లైఫ్‌లో స్నేహానికి తావుండదు. అంతా బిజినెస్ లైక్. నిజమైన స్నేహం చిన్నప్పటిదే. అందుకే మొహంవాచిపోయాను.

ఉండు. లెటర్ రాసిస్తాను. "వాచీ చూసుకున్నాడు శేఖరం." ప్లేన్ కి టైమయిపోతోంది." అని లెటర్ హెడ్ మీద నాలుగు వాక్యాలు వ్రాసి ఉత్తరం కవరులో పెట్టి—

"వెంకట్రావ్... క్షమించు... నాకు టైమవుతోంది. మళ్ళీ వస్తానుకదూ? అప్పుడు తీరిగ్గా కబుర్లు చెప్పుకుందాం. వాసవికి చెప్పు - నేను వచ్చి పార్టీ తీసుకుంటానని. ఈ లెటరు తీసుకుని రఘురామ్‌ని కలుసుకుని-ముక్కుమీద గుద్ది ఆర్డర్ తీసుకో - గుడ్‌లక్-" కవరందించాడు శేఖరం.

"నీ రుణం ఎలా తీర్చుకోవాలో తెలియడం లేదు—"

"నోర్మెయ్. రుణమట! రుణం. ఇంకెప్పుడూ నా దగ్గర యిలాటి సారం లేని డైలాగులు చెప్పకు. ఒరేయ్! నిజంగా మేలుచేసింది నువ్వు. ఆవేళ స్లిప్పులందించి నన్ను స్కూలు ఫైనల్ పాసుచేయించకపోతే నా గీత మరొకలా ఉండేది. జీవితం యింత దిగ్విజయంగా సాగేదికాదు. ఒరేయ్. నేను కేవలం కృతజ్ఞతకోసం యిలా చేస్తున్నాననుకోకు. స్నేహంరా. స్నేహంలో మాధుర్యం అంతగొప్పది."

"ఆల్‌రైట్. నువ్వెళ్ళు."

వెంకట్రావు బయటకు వచ్చేడు.

అప్పటికి వెన్నెల వచ్చింది-కొంచం. ఉదయిస్తున్న చంద్రుడు - యూరోపియన్ తాలూకు బట్టతలలా ఉన్నాడు. చంద్రుడి చుట్టూ దూరంగా చెదురు మదురుగా ఉన్న మేఘాలు - బట్టతల చుట్టూవుండే తెల్లవెంట్రుకల్లా వున్నాయి.

వెంకట్రావు కళ్లముందు రంగురంగుల కలలు రంగులరాట్నం తిరుగుతున్నాయి. భవిష్యత్తు బంగారంలా కనిపిస్తోంది.

ఇంకేముంది? వాసవికి ఉద్యోగం వచ్చేస్తుంది. ఆమె ఉత్సాహంగా ఉంటుంది. తనకి చాలా తృప్తి.

* * *

ఆశాకిరణాలతో వెలుగుతున్న అన్నయ్య కళ్ళల్లోకి చూసి ఆశ్చర్యపడింది వాసవి. ఏం జరిగిందో అర్థం కాలేదామెకి.

"ఏమిటన్నయ్యా అంత ఉషారుగా వున్నావు?"

చెప్పదలుచుకోలేదతను. రేపు ఆర్డరు తెచ్చి 'ప్లెజంట్ సర్‌ప్రైజ్' అనాలని నిశ్చయించుకున్నాడు. శుభవార్త హటాత్తుగా వింటే కలిగే ఆనందానికీ-ఎదురు చూసినప్పటి ఆనందానికీ తేడావుంటుంది.

"గొప్పవాళ్లలో కూడా మంచివాళ్లుంటారు వాసవీ!" నవ్వాడతను.

* * *

"నన్నూ రమ్మంటావా అన్నయ్యా?"

"అవసరంలేదు వసూ. ఈ ఎండలో నీకెందుకు శ్రమ?"

వెంకట్రావు జిల్లాపరిషత్ కార్యాలయానికి చేరుకున్నాడు సిటీబస్సులో.

మేడమెట్లెక్కి ఛెయిర్మన్ ఛాంబర్ దగ్గరకి నడిచాడు.

ద్వారంముందు బంట్రోతు అడ్డు పడ్డాడు. "చీటీరాసిస్తే - దొరగారికి చూపిస్తాను, ర మ్మం టే వెళ్దురుగాని. అసలే బాబుగారివాళ బిజీగా ఉన్నారు. లోపల చాలామంది ఉన్నారు."

వెంకట్రావుకి కోపం వచ్చింది. ఈ బంట్రోతుగాడి కెంత తలబిరుసు ! తనెవ రనుకున్నాడు ? శేఖరం ఫ్రెండ్. శేఖరం మాట అంటే ఛెయిర్మన్‌కి వేదవాక్కు- చెయిర్మన్‌కి చెప్పి ఉద్యోగం ఊడ బెరికిస్తేసరి - ప్యూనుగాడి పొగరణుగు తుంది.

ఐదునిముషాలు గడిచాక లోపలికి వెళ్ళడానికనుమతి లభించింది వెంకట్రా వుకి. ఆ కొంచం ఆలస్యానికే వెంకట్రా వుకి ఛెయిర్మను మీదకూడా కోపం వచ్చే సింది.

స్వింగ్‌డోర్ తెరచి - వెంకట్రావుని ఛాంబర్‌లోకి తోశాడు ప్యూను.

అది - గదిలాలేదు. రాజభవనంలో మెయిన్‌హాలులా ఉంది

ఛెయిర్మన్-మహారాజులా ఉన్నాడు మెలిదిరిగిన మీసాలతో.

అతనాసీనుడైన కుర్చీ కుర్చీలా లేదు. సింహాసనంలా ఉంది చిత్రమైన నగిషీ పనితో. అతను ధరించిన సిల్కుటర్బను- కిరీటంకంటె కోటిరెట్లు అందంగావుంది. అతను - నుదుట తిలకం తీర్చిదిద్దు కున్నాడు. తలంటుపోసుకున్నాడు. ఖరీదైన కొత్తబట్టలు కట్టుకున్నాడు. సెంటు వాసనలతో గుబాళిస్తున్నాడు.

అతనిచుట్టూ వున్న కుర్చీలలో సామంతరాజులవంటి మనుషులు ముఖాల మీద ఆనందాన్నీ పెదవులమీద మంద హాసాన్నీ దట్టంగా పూసుకుని వున్నారు.

అతని జేబులుమీద ఖరీదయిన బహు మతులూ - వాటిపక్కనే ఖాళీ అయిన సీసాలూ నిర్లక్ష్యంగా పడివున్నాయి.

అతను దర్జాగా హుందాగా కూర్చు న్నాడు.

వెంకట్రావుకి మతిపోయినంత పనయింది

"విష్ యు హేపీ బర్త్‌డే."

"మెనీ రిటర్న్స్ ఆఫ్ ది డే."

"మే గాడ్ బ్లెస్ యు విత్ హండ్రెడియర్స్ ఆఫ్ లైఫ్."

"ఫార్ట్యూన్ అండ్ ప్రాస్పరిటీ."

ఒక్కొక్కరూ వెళ్ళిపోయారు

ఆ గదిలో మిగిలింది వెంకట్రావూ- రఘురామ్ లిద్దరే.

అప్పుడు చూశాడతను వెంకట్రా వుని - "ఇలా కూర్చోండి-" కుర్చీ చూపాడు.

"థాంక్యూ వెరీమచ్ సార్."

"ఇవాళ నా బర్త్‌డే."

"జన్మదిన శుభాకాంక్షలు-" చిరు నవ్వు నవ్వాడు.

"మీ పేరు వెంకట్రావా ? వెంక ట్రమణా ?"

"వెంకట్రావు."

"వెంకట్రావ్‌గారూ ! శేఖరం, నేనూ

కావలసినవాళ్లం. అతనికి మీరు చాలా క్లోజ్ ఫ్రెండ్ కనుక నాకూ మీరంతే."

"చాలా ధన్యవాదాలు."

"పుట్టినరోజుకి నేను ఒకవిధమయిన ప్రత్యేకత ఆపాదిస్తాను."

"మంచిదే. నిజంగా పుట్టినరోజు మనిషికి ప్రత్యేకమైనదే."

"మనిషి - పుట్టినప్పుడు అమాయకంగా ఉంటాడు. ఆకలితప్ప మరొకటి తెలియదు."

"వెల్ సెడ్! మీరు కవులనుకుంటాను."

"కవిత్వానికి తీరికెక్కడుందీ జీవితంలో? మనిషి స్వచ్ఛంగా పుట్టి-కాలంతో కలుషితంఐపోతాడు.వయస్సు.. విద్య... వృత్తి సంపాదన... అతని హృదయంమీద ప్రభావం చూపి-అతణ్ని మార్చివేస్తాయి."

"చక్కని నిజం."

"కనీసం-పుట్టినరోజుకైనా మనిషిలా సహజంగా స్వచ్ఛంగా – రోజంతా కాకపోయినా - కొన్ని క్షణాలయినా ప్రవర్తించడం నేను అలవాటుచేసుకున్నాను. పుట్టినరోజుపూట కనీసం ఒక మంచిపని చెయ్యాలి."

"వెరీ నైస్ ప్రిన్సిపల్."

"ఇవాళ ఉదయం నేను మంచిపని చేశాననుకుంటున్నాను."

"ఏమిటి?"

"ఎలిమెంటరీ స్కూలులో టీచర్ పోస్టుకి రెండువందల అప్లికేషన్స్ వచ్చాయి. ఇంటర్వ్యూలకి పిలిచింది ఇరవైమందిని.

ఇరవైమందిలోనూ పందొమ్మిది మందికి రికమెండేషన్లున్నాయి. మినిస్టర్ దగ్గరనుంచి సినీస్టార్ వరకూ ఎవరోఒకరి రికమెండేషనే. రికమెండేషన్‌లేని క్యాండిడేట్ ఒక్కరే."

"రోజులలావున్నాయి. అనెంప్లాయ్‌మెంట్ ప్రాబ్లమ్ గురించి మీకు నేను చెప్పాలా?"

"రికమెండేషన్ లేదంటే - రియల్లీ డిజర్వింగ్ అన్నమాట. ఏ ఆధారమూ లేని అటువంటి క్యాండిడేటుకి ఉద్యోగం యిచ్చి ఉపాధి కల్పించడం మంచిపనిగా తోచింది. వెంటనే చేసేశాను. మీరేమనుకుంటారో అని భయపడ్డాను. కాని మీతో మాటలాడాక మీరు నన్ను అభినందించగలరనే విశ్వాసం కలిగింది."

వెంకట్రావుకి మతిపోయింది.కోపమూ వచ్చింది కానీ బయటపడ్డానికి ధైర్యం చాలలేదు.

"మీకు త్వరలో ఉద్యోగం యిప్పిస్తాను. ఈసారికి క్షమించండి. ఏం?"

నోట మాటరాలేదు వెంకట్రావ్‌కి "ఉద్యోగం నాకు కాదు. మా చెల్లెలికి" అన్నాడెలాగో

"అరె! నిన్న శేఖరం మీ పేరే చెప్పినట్లుంది? అలాగే నోట్‌చేసుకున్నాను నా డైరీలో. సర్లెండి మీ చెల్లెలికతిత్వరలో ఉద్యోగం వేయిస్తాను. ప్లీజ్, మీరు వెళ్ళిరండి. అప్పుడప్పుడూ నన్ను

కలుస్తూ వుండండి. శేఖరానికి ఏమీ రాయకండి. నామీద కోపం వస్తుంది.''

బెల్ నొక్కాడు.

ప్యూనువచ్చి వెంకట్రావుని బయటకు తీసుకువెళ్ళాడు.

వెంకట్రావుకి ముచ్చెమటలుపోశాయి.

సిద్ధాన్నం నోటివరకూ వచ్చి కూడా అందకుండా పోయింది.

ఛెయిర్మన్ చెప్పింది నిజమేనా ?

రికమెండేషన్ లేకుండా ఉద్యోగం యిచ్చాడంటే - నమ్మవలసిన విషయ మేనా ?

నాటకంకాదుకద ?

ఏమో! ఈ గొప్పవాళ్ళాడే నాటకాలు గొప్పగానే ఉంటాయి. లేకపోతే-శేఖరం ఫోనులో క్యాండిడేటు పేరు చెప్పక పోవడమేం? మొక్కుబడి తీర్చుకున్నట్లు పొడి పొడి ముక్కలేమిటి?

అసలిదంతా-శేఖరమూ, ఛెయిర్మనూ కలసి ఆడిన నాటకం కాదుకద?

ఏమో? తనకేమీ అర్థంకావడంలేదు.

మొత్తానికి మొండిచెయ్యే ఎదురైంది.

శేఖరం రికమెండ్ చెయ్యకపోతే ఉద్యోగం వచ్చిఉండేదేమో? ఇంతకీ— నిజంగా ఛెయిర్మన్ నిష్పక్షపాతంగా సెలక్ట్ చేశాడని నమ్మడం ఎలా?

నీరసంగా యిల్లు చేరుకున్నాడు వెంకట్రావ్.

"ఆర్డరుతెచ్చావా?" ఆశగా అడిగింది వాసవి.

"లేదు వసూ! ఈ గొప్పవాళ్ళున్నారే వొట్టి నీచులు! మాటకి కట్టుబడే మను షులుకారు. వాళ్ళు మనలాటి మధ్యతర గతివాళ్ళని సుఖపడనిస్తారా?

ఛెయిర్మన్ అంటాడూ- లంచమూ రికమెండేషనూ లేని ఒకే ఒక్క క్యాండి డేటుకి పొద్దున్నే ఆర్డర్స్ వేశాడట! నమ్మదగిన మాటేనాయిది? నాటకం... అంతా నాటకం..."

"పోన్లే అన్నయ్యా! నిజంగా అలాగే జరిగితే అంతకంటే కావలసిందేముంది? లంచాలనీ రికమెండేషన్లనీ కాదనిఅర్హత లను బట్టి ఉద్యోగాలివ్వడం ప్రారంభిస్తే మళ్ళీ స్వర్ణయుగం ప్రారంభమవుతుందీ దేశంలో."

"వట్టిది వాసవీ! ఈ దేశం యిక బాగుపడదు. నీతి, నిజాయితీలు లేనే లేవు. అంతా మోసం...దగా..."

"ఆవేశపడకన్నయ్యా...అసలే నీ ఆరోగ్యం అంతంతమాత్రం. మన రేఖలు సవ్యంగా లేనప్పుడు ఎవరిని తిట్టుకుని ఏంలాభం?"

"నిజమే. శేఖరం నిన్న కనపడక పోతే-నీకూ రికమెండేషన్ ఉండేది కాదు. ఉద్యోగం వచ్చేదేమో." కుర్చీలో కూల బడ్డాడు వెంకట్రావు.

"పోస్ట్..."

వెళ్ళి అందుకుంది వాసవి.

వెంకట్రావు ఆత్రుతగా చూస్తు న్నాడు.

కవరు చింపేసరికి— జిల్లాపరిషత్ వారు ఎలిమెంటరీ స్కూలు టీచర్‌గా వాసవిని అపాయింట్ చేస్తున్నట్లు ఆర్డరు— నవ్వుతూ బయటపడింది.

—